# చలికాలం.. జీవాలు భద్రం!

**ఎముకలు కొరికే చలికి మనుషులతో పాటు మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. వాతావరణ మార్పులతో పశువులు, జీవాలకు సంక్రమించే వ్యాధులతో పెంపకందారులు కలవరపడుతున్నారు. సకాలంలో టీకాలు వేయించి అప్రమత్తంగా ఉండాలని పశువైద్యులు సూచిస్తున్నారు.**

- పశువులకు వ్యాధులు సోకే అవకాశం
- జాగ్రత్తలు తీసుకోకపోతే తీరని నష్టం
- పీపీఆర్ వ్యాక్సిన్‌తో నివారణకు చర్యలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పశువైద్యులు



బొంపల్లిలో జీవాలకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సిబ్బంది

**దోమ:** చలి తీవ్రత రోజు రోజుకూ పెరిగిపోతుండడంతో పశువులు, జీవాలకు పలు రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. వాతావరణంలో వచ్చే మార్పులతో పశువులకు తుమ్ములు రావడం, కళ్లు, ముక్కు నుంచి నీరు కారడం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. దీంతో క్రిములు సోకి అంటువ్యాధులతో పాటు ఆరు బయట తినడంతో శ్వాస కోశంలో వచ్చే లక్షణాలు సంభవిస్తుంటాయి. ఈ మేరకు పశువులు, జీవాలు వ్యాధుల బారిన పడకుండా పెంపకందారులు తగు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారులు సూచనలు ఇస్తున్నారు.

**మెండుగా పశుసంపద**

దోమ మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో రైతులు, పెంపకందారులకు 11,850 పశువులు, 9,964 గేదెలు, 26,312 గొర్రెలు, 17,163 మేకలున్నాయి. వీటికి చలి తీవ్రత కారణంగా ఎక్కువగా దొమ్మ రోగం, గాలికుంటూ, ఫుట్‌రాట్, నియోనియా, చిటుకు వ్యాధి, పీపీఆర్ వంటి వ్యాధులు సంభవిస్తుంటాయి. ఈ వ్యాధులకు పలు రకాల బ్యాక్టీరియాలు, వైరస్‌లు, పరాన్న జీవులు కారణం అవుతుంటాయి. దీంతో తీవ్రంగా జ్వరం రావడంతో పాటు శ్వాస పీల్చుకోకపోవడం, ఎగశ్వాస రావడం, ముక్కు నుంచి నీరు, చీమిడి కారడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలతో నీరసించిపోతాయి. మరో పక్కా కళ్లు ఎర్రబడడం, వీపు భాగం వంగి ఉండడం, తల, మెడ ముందుకు సాగినట్లు కనిపించడం, ముక్కు రంధ్రాలు వెడల్పుగా అవుతుంటాయి. త్వరగా చికిత్స చేయించకపోతే ఊపిరితిత్తులు వాచి చీము పట్టే ప్రమాదం ఉంటుంది.

**జాగ్రత్తలు తప్పనిసరి**

వ్యాధుల నివారణకు పెంపకందారులు, రైతులు తగు జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. పశువులు, జీవాలకు గాలి, వెలుతురు సరిగ్గా వచ్చే విధంగా చూడాలి. వాతావరణం అనుకూలంగా లేనప్పుడు జీవాలను బయటకు వదలకూడదు. పాకలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధులు సోకినప్పుడు పశువైద్యాధికారులను సంప్రదించాలి. పెంపకందారులు ఎప్పటికప్పుడూ తగు జాగ్రత్తలు పాటిస్తూ పశువులకు పీపీఆర్(పెస్టే డెస్ పెటిట్స్ రుమినెంట్స్) అనే టీకాలు వేయిస్తే రోగాల బారి నుంచి తప్పించుకోవడానికి ఎంతో మేలు చేకూరుతుందని పశువైద్యులు చెబుతున్నారు. ఈ మేరకు పశు వైద్యాధికారుల సూచనలు, సలహాలతో జీవాలను కాపాడుకునేందుకు రైతులు చర్యలు తీసుకోవాలి.

**జీవాలపై శ్రద్ధ చూపాలి**



పశువులు, జీవాలు చలి బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలి. జీవాల విషయంలో పెంపకందారులు ఎక్కువగా శ్రద్ధ వహించాలి. ముఖ్యంగా గొర్రెలు, మేకలలో పీపీఆర్(ముసర, చీడపారుడు వ్యాధి) ఎక్కువగా సోకే అవకాశం ఉంటుంది. దీంతో 90 శాతం వరకు జీవాలు మృతి చెందుతాయి. పెంపకందారులు వెంటనే అప్రమత్తమై వ్యాధి నివారణకు పశువైద్యులను సంప్రదించాలి. పీపీఆర్ వ్యాక్సిన్ వేయించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– స్వప్న, పశువైద్యాధికారి, బొంపల్లి

# విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌ల అందజేత



చందర్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**దోమ:** ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు తమవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని దాదాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి గొల్ల చందర్ అన్నారు. సోమవారం దాదాపూర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అమర్నాథ్‌తో కలిసి ఆయన 408 మంది విద్యార్థులకు టై, బెల్ట్, స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల అభ్యున్నతే తన లక్ష్యమని, తనకు తోచిన సహాయం ఎల్లప్పుడూ అందిస్తానని తెలిపారు. అనంతరం చందర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణ, మాజీ ఉపసర్పంచ్ గఫార్, గ్రామస్తులు వెంకటయ్య, బిచ్చన్న, బాలయ్య, మహమ్మద్, ఎల్లయ్య, చెన్నయ్య, గురుచరణ్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలను వదిలి పనిచేయండి

- మాజీ మంత్రి సబితారెడ్డి
- రోడ్డు ప్రమాద మృతులకు నివాళి



మృతుల కుమారులను ఓదార్చుతున్న మాజీ మంత్రి సబితారెడ్డి

**శంకర్‌పల్లి:** అధికార పక్షం నాయకులు రాజకీయాలు పక్కన పెట్టి హైదరాబాద్–బీజాపూర్ రహదారి విస్తరణ పనులు చేపట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని మిర్జాగూడ స్టేజీ సమీపంలో ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూర్ గ్రామానికి చెందిన లక్ష్మారెడ్డి, భాగ్యలక్ష్మి దంపతుల మృతదేహాలకు సోమవారం ఆమె నివాళులర్పించారు. అనంతరం వారి కుమారులకు ధైర్యం చెప్పారు. అనంతరం సబితారెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణ పనులు చేయకపోవడంతో నిత్యం ఎంతో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. గత ప్రభుత్వ హయాంలో అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు రోడ్డు విస్తరణ చేసి, జాతీయ రహదారిగా చేయాలని ప్రణాళికలు రూపొందించాం. దానికి అనుగుణంగానే టెండర్లు సైతం పిలిచాం. ఆ ప్రక్రియ అంతా పూర్తయి దాదాపు ఏదాదిన్నర అయినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై వందలాది మంది మృతి చెందుతున్నారని, ఇప్పటికైనా అధికార పక్షం నాయకులు రోడ్డు పనులను చేపట్టాలని విపక్షంగా తాము అడుగుతున్నామని మాజీ మంత్రి సబితారెడ్డి అన్నారు. మంత్రి వెంట శంకర్‌పల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, లింగం, మహేందర్ రెడ్డి, ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

# భోజనంలో నాణ్యత తప్పనిసరి



దోమ: పోతిరెడ్డిపల్లి పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకట్

**దోమ:** విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో నిర్వాహకులు నాణ్యత పాటించాలని ఎంఈఓ వెంకట్ సూచించారు. సోమవారం మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మాట్లాడారు. ప్రతి విద్యార్థికి నాణ్యతతో కూడిన భోజనం అందించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనం విషయంలో చాలా సీరియస్‌గా ఉందని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్, సీఆర్పీ సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విద్యార్థుల ఆరోగ్యమే ముఖ్యం**

**దుద్యాల్:** పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ వెంకన్న గౌడ్, ఎంఈఓ విజయరామరావు అన్నారు. మండల పరిధిలోని చెట్టుపల్లి తండా సమీపంలో ఉన్న కేజీబీవీలో ఎంపీడీఓ మధ్యాహ్న భోజనం పరిశీలించగా, ఈర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో ఎంపీడీఓ, ఎంఈఓలు మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, రుచిగా వండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేశ్ కుమార్, కేజీబీవీ ఎస్‌వో రాధిక, ఈర్లపల్లి పాఠశాల హెచ్‌ఎం, సీఆర్పీ రాందాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దుద్యాల్: ఈర్లపల్లిలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ విజయరామరావు

## నేడు పర్సాపూర్‌లో రైతు నేస్తం

**దుద్యాల్:** యాసంగి వరి సాగు విధివిధానాలను రైతులకు వివరించేందుకు రైతు నేస్తం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు ఏఈఓ భావన తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ.. యాసంగిలో వరి సాగు చేసే విధానం, నారుమడి యాజమాన్యం వంటి పలు విషయాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు వివరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని కొడంగల్ మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామ రైతు వేదికలో నిర్వహిస్తున్నామని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలివ్వండి

**అనంతగిరి:** తమ వారసులకు జీవో నంబర్ 81 ప్రకారం ఉద్యోగాలు ఇవ్వాలని వీఆర్ఏల సంఘం జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వంగూరు రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. 61 ఏళ్లు దాటిన వీఆర్ఏ వారసులకు వెంటనే డ్యూటీలు ఇవ్వాలన్నారు. వాళ్లకు రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మైపాల్, శ్రీకాంత్, జనార్దన్, సురేష్, రాజు, శివ, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలి

**బీఆర్ఎస్ నేత కార్తీక్‌రెడ్డి**

**చేవెళ్ల:** హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై నిత్యం ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ జాతీయ మీడియా స్పోక్స్ పర్సన్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి సోమవారం చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ప్రభుత్వంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ చేవెళ్ల సీఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్–బీజాపూర్ రోడ్డు విస్తరణ పనుల కోసం టెండర్లు సైతం పూర్తయినా, పనులు ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు ఇప్పటికైనా స్పందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, నాయకులు దేశమొల్ల ఆంజనేయులు, షాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పట్నం అవినాశ్ రెడ్డి, నాయకులు ప్రభాకర్, నర్సింగ్‌రావు, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జీవాలకు టీకాలు తప్పనిసరి

**షాబాద్:** రైతులు మూగ జీవాలకు పారుడు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించుకోవాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని అంతారం, షాబాద్ గ్రామాల్లో సిబ్బందితో కలిసి మూగజీవాలకు పారుడు వ్యాధి టీకాలు వేశారు. రైతులు తప్పనిసరిగా తమ వద్ద గల మూగజీవాలకు టీకాలు వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీవాలకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పారుడు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు తెలిపారు.

## క్లుప్తంగా

### చెన్నారెడ్డికి నేతల నివాళి



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు

**అనంతగిరి:** దివంగత మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం వికారాబాద్‌లోని ఆయన విగ్రహానికి ప్రజాప్రతినిధులు, నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చెన్నారెడ్డి ఇక్కడి ప్రాంతానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. నివాళులర్పించిన వారిలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేశ్‌కుమార్, అనంత్‌రెడ్డి, రమేశ్‌కుమార్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

### యథేచ్ఛగా అధిక లోడ్ టిప్పర్లు



కవర్ లేకుండా డస్ట్ వేసుకొని ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పర్

**పరిగి:** అధికలోడ్‌తో వెళ్తున్న వాహనాలతో రోడ్డు ధ్వంసమై గుంతలమయంగా మారుతుంది. ఓవర్‌లోడ్‌తో పట్టణ కేంద్రంలో టిప్పర్లు తిరుగుతుండటంతో రోడ్డు వేసిన కొద్ది రోజులకే ఛిద్రమైపోతుంది. డస్ట్, కంకరను ఓవర్ లోడ్ వేసుకున్నప్పుడు దుమ్మూ ధూళి రోడ్డుపై పడకుండా పైన కవర్ కప్పాల్సి ఉంది. కానీ అవేవీ లేకుండానే యథేచ్ఛగా రోడ్డుపై పదుల సంఖ్యలో టిప్పర్లు తిరుగుతున్నాయి. దీంతో వాటి వెనకాల వెళ్లే ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో దుమ్ము పడి ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు.


### మతిస్థిమితం లేని వ్యక్తికి సపర్యలు



సపర్యలు చేస్తున్న అమ్మానాన్న ఫౌండేషన్ సభ్యులు

**కొడంగల్ రూరల్:** పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి సమీపంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తిని సోమవారం అమ్మానాన్న ఫౌండేషన్ సభ్యులు చేరదీసి సపర్యలు చేశారు. కొద్ది రోజులుగా కొడంగల్‌లోనే ఉంటున్నాడని, ఆయన పేరు వజిత్‌ఖాన్ అని, గ్రామం బెంగుళూరు అని చెబుతున్నాడని ఫౌండర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ క్రమంలోనే వజిత్‌ఖాన్‌కు కటింగ్ చేశాక, స్నానం చేయించి దుస్తులు అందించారు. శరీరంపై దెబ్బ తగిలిన ప్రాంతంలో డ్రెస్సింగ్ చేశారు.

### శానిటేషన్ పనుల పరిశీలన



పారిశుద్ధ్య సిబ్బందికి సూచనలు ఇస్తున్న చైర్‌పర్సన్

**అనంతగిరి:** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని కొత్తగంజ్‌లో జరుగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ పనులను సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులో చేయాల్సిన శానిటేషన్ పనులపై సమీక్షించారు. ఎక్కడ చెత్తా చెదారం లేకుండా తొలగించి కాలనీవాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, పలువురు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### గ్రామస్తులకు ఇబ్బంది కలిగించొద్దు

**కుల్కచర్ల:** గ్రామస్తులకు ఇబ్బందులు కలిగించే చర్యలు తీసుకోరాదని మండలంలోని ముజాహిద్‌పూర్ పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ అన్నారు. సోమవారం గ్రామపంచాయతీలో పర్యటించిన ఆయన.. బురదమయంగా మారిన రోడ్లను గమనించి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ పైప్‌లైన్ ఏర్పాటుచేసే సమయంలో కొంత భాగం మిగిలిపోయిన ప్రాంతాలకు సైతం నీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జీపీ సిబ్బంది యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# పట్టణాభివృద్ధి పనులకు తీర్మానం

**మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్**



సాధారణ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

**పరిగి:** కోట్ల రూపాయలతో పట్టణాభివృద్ధి జరుగుతుందని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. సోమవారం మున్సిపల్ సాధారణ సమావేశాన్ని పట్టణ కేంద్రంలోని కార్యాలయ సమావేశపు హాల్లో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.75 లక్షలతో పట్టణ అభివృద్ధికి పనులు చేపడుతామన్నారు. 15 వార్డుల్లో రూ.3 లక్షల చొప్పున రూ.45 లక్షలతో అండర్‌డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను నిర్వహిస్తామన్నారు. 15వ ఆర్థిక సంవత్సర నిధులతో రూ.30 లక్షలతో పార్కులు, నర్సరీల అభివృద్ధికి తీర్మానించామన్నారు. పట్టణంలో రూ.1.5 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతామన్నారు. పట్టణంలో ఎక్కడ సమస్యలు లేకుండా ప్రతి వార్డుల్లో సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఇప్పటికే పలు వార్డుల్లో ఏ సమస్యలు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. చిన్న చిన్న పనులకు త్వరలోనే పూర్తి చేసి పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రభుత్వం నుంచి మరికొంత నిధులు రావాల్సి ఉందని వచ్చిన వెంటనే పట్టణంలో పలు కాలనీల్లో సీసీ రోడ్ల పనులకు పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ప్రసన్నలక్ష్మి, కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.

## భవిష్యత్ అంతా 'ఏఐ'దే

**మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్**



విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న మున్సిపల్ చైరపర్సన్

**తాండూరు టౌన్:** భవిష్యత్ అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దేనని పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నాపరిమళ్ అన్నారు. సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాక్షత్ మిషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏఎస్ కంప్యూటర్ సాఫ్ట్ స్కిల్స్ సెంటర్ సహకారంతో కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నేటి ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్ ఆవశ్యకత ఎంతగానో ఉందన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉపయోగపడే కంప్యూటర్ కోర్సులను నేర్చుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. అంబేడ్కర్ సాక్షత్ మిషన్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటి వరకు తొమ్మిది బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు ఉచితంగా కోర్సుల్లో శిక్షణ ఇప్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేంద్రం ఇన్‌చార్జి అన్నపూర్ణ, డైరెక్టర్ పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు పింఛన్ పెంచాలి



ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్పీఆర్‌డీ సభ్యులు

**మోమిన్‌పేట:** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు పెంచుతామన్న పింఛన్‌ను వెంటనే అమలు చేయాలని ఎన్పీఆర్‌డీ మండల కమిటీ అధ్యక్షుడు మురహరి డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీఓ విజయలక్ష్మికి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ శాసన సభ ఎన్నికల్లో దివ్యాంగులకు నెలకు రూ.6వేల పింఛన్ అందిస్తామని హామీ ఇచ్చి ఏడాది కావస్తున్న పెంచడం లేదన్నారు. ప్రభుత్వ వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. తీవ్ర వైకల్యం కలిగిన వారికి ప్రత్యేక అలవెన్సులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎన్పీఆర్‌డీ సభ్యులు రామయ్య, జగన్, ఈశ్వరమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడి పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరమేశ్‌కుమార్ తదితరులు

**అనంతగిరి:** వికారాబాద్ పట్టణంలోని హనుమాన్ మందిరంలో సోమవారం నాగరాజు గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ ఘనంగా నిర్వహించారు. స్వామి 18వ సారి మాల ధరించిన సందర్భంగా పడి పూజ చేశారు. ఇందులో భాగంగా అయ్యప్పస్వామికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, అలంకరణ చేసి పడి వెలిగించారు. ఈ సందర్భంగా రవి పంతులు గురుస్వామి ఆధ్వర్యంలో ఆలపించిన పాటలతో ఆలయ ప్రాంగణమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్‌కుమార్, పలువురు ప్రముఖులు పాల్గొని నాగరాజు స్వామిని శాలువాలతో సన్మానించారు.

# బాల్య వివాహాలను అరికట్టాలి



బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

**కుల్కచర్ల:** బాల్య వివాహాల నిరోధాన్ని ప్రతిజ్ఞకరూ తమ బాధ్యతగా భావించాలని ఎంఈఓ హబీబ్ అహ్మద్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మండల కోఆర్డినేటర్ ఆంజనేయులు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థినులు తమ పరిసర ఇళ్లలో బాల్యవివాహాలు జరిగితే 1098కి లేదా 100కి సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి దేవి, చౌడాపూర్ ప్రత్యేకాధికారి జ్యోతి, చైల్డ్ లైన్ సిబ్బంది, స్థానిక ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కార్తీకమాస ముగింపు వేడుక



తాండూరు: అలంకరణలో శివలింగం

**దుద్యాల్:** మండల పరిధిలోని ఆలేడ్ గ్రామంలో కార్తీక మాస ముగింపు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆంజనేయస్వామి దేవాలయంలో హోమం ఏర్పాటు చేశారు. భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్న సంతర్పణ నిర్వహించారు.

**భావిగి భద్రేశ్వరస్వామి ఆలయంలో..**

**తాండూరు:** పట్టణంలోని భావిగి భద్రేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం కార్తీకమాస ముగింపు పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం శివలింగానికి అన్నాభిషేకం చేశారు. అనంతరం స్వామివారిని అమర్‌నాథ్ మంచులింగంగా ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

# ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్న కాంగ్రెస్

**మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం**



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

**చేవెళ్ల:** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే పెద్దఎత్తున ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు కేఎస్ రత్నం ధ్వజమెత్తారు. సోమవారం చేవెళ్లలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ఇప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ పార్టీ నాయకులను విమర్శిస్తూనే లక్షల కోట్లు సంపాదించుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రజా సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని, బీజేపీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందన్నారు. సమావేశంలో నాయకులు డా.వైభవ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, కృష్ణగౌడ్, కృష్ణమోహన్, జయసింహారెడ్డి, అంజనేయులుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.